
వడ్లను పంపిణీ చేస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

# రామకోటి కృషి అభినందనీయం

- గజ్వేల్‌లో ప్రారంభమైన తలంబ్రాల దీక్ష
- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, మార్చి 14: కోటి తలంబ్రాల దీక్షలో పట్టణవాసులను భాగస్వాములను చేయడం రామకోటి చేస్తున్న కృషి అభినందనీయమని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని కృష్ణాలాయంలో భద్రచలంలోని సీతారాముల కల్యాణానికి అందించే గోటితో వలిచే తలంబ్రాల దీక్షను వంటేరు ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 ఏండ్లుగా రామరాజు చేస్తున్న ఆధ్యాత్మిక కృషి, పట్టుదలను గుర్తించిన భద్రాచల దేవాస్థానం వారు వడ్లను తలంబ్రాలుగా మార్చే పనిని అప్పగించిందన్నారు. గజ్వేల్ పట్టణవాసులకు ఇలాంటి అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, నాయకులు గుంటుకరాజు, ఆలయ నిర్వాహకులు రామచంద్రం, వెంకటేశం, మోత్రాములు, లక్ష్మయ్య, చంద్రశేఖర్, సత్యనారాయణ, పాండు, కృష్ణ తదితరులు ఉన్నారు.

# అర్హులకు పథకాలు అందేలా చూడాలి

మిరుదొడ్డి, మార్చి 14: అధికారులు అందుబాటులో ఉంటూ అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఎంపీపీ గజ్జల సాయిలు అన్నారు. గురువారం మిరుదొడ్డి ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ ప్రారంభం కాగానే వైస్ ఎంపీపీ పోలీసు రాజులు విద్యుత్, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ శాఖల అధికారులు విధులు నిర్వర్తించడంలో అలసత్వం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్సైజ్ శాఖ అధికారులు గత సర్వసభ్య సమావేశంలో అల్వాల గ్రామంలో కల్లు అమ్మకాలపై చర్యలు తీసుకోవాలని కోరినా, నేటికీ చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ గజ్జల సాయిలు మాట్లాడుతూ విధుల పట్ల అధికారులు అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బాలమల్లేశం గౌడ్, ఎంపీడీవో గణేశ్‌రెడ్డి, తహసీల్దార్ గోవర్ధన్, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

# అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం: చాడ

హుస్నాబాద్, మార్చి 14: భూమికోసం, భుక్తి కోసం, నైజాం నిరంకుశ పాలన అంతం కోసం సాయుధ పోరాటం చేసి అమరులైన వారి త్యాగాలు చిరస్మరణీయమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటానికి శ్రీకారం చుట్టిన అనభేరి ప్రభాకర్‌రావు, సింగిరెడ్డి భూపతిరెడ్డి సహా మరో 12మంది అమరవీరుల 73వ వర్ధంతిని గురువారం హుస్నాబాద్‌లోని డిపో క్రాసింగ్ వద్ద నిర్వహించారు. అనభేరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహ్మదాపూర్ గుట్టల్లోని అనభేరి సహా మిగతా అమరవీరుల స్మారక స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో చాడ మాట్లాడుతూ నిజాం, రజాకార్ల నిరంకుశత్వాన్ని వ్యతిరేకిస్తూ సాయుధ పోరాటం చేసిన యోధులను స్మరించుకోవాలన్నారు. మహ్మదాపూర్ గుట్టల్లో ఎన్‌కౌంటర్‌కు గురైన అనభేరి సహా మిగతా అమరవీరుల విగ్రహాలను హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్, నాయకులు భాస్కర్, జనార్దన్, గూడెం లక్ష్మి, బెక్కంటి సంపత్ పాల్గొన్నారు.

# సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం

నారాయణరావుపేట, మార్చి 14: ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో పని చేసి మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఎంపీపీ బాలకృష్ణ అన్నారు. మండల కేంద్రమైన నారాయణరావుపేటలోని గ్రామ పంచాయతీ భవనంలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభలో వ్యవసాయ, వైద్య, విద్య, వివిధ అభివృద్ధి పనులపై చర్చించారు. అధికారుల పనితీరు మార్చుకోవాలని వైస్ ఎంపీపీ సంతోష్‌కుమార్ సూచించారు. ఉద్యానవన శాఖ ఆయిల్ పామ్ పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించడం లేదని ఆరోపించారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల రైతులు నష్టపోతున్నారని చెప్పారు. ఎంపీటీసీ హరీశ్ 12 తీర్మానాలను ప్రవేశపెట్టగా వైస్ ఎంపీపీ సంతోష్‌కుమార్ బలపరిచారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సహకారంతో మండలాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తామన్నారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీరాములు, ఎంపీవో శ్రీనివాస్, ఎంపీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డబ్బుల పంపకంలో తేడాతోనే హత్య

సిద్దిపేటరూరల్, మార్చి 14: ఎల్లంకి కళాశాల సమీపంలో జరిగిన హత్య కేసును సిద్దిపేట రూరల్ పోలీసులు ఛేదించారు. గురువారం సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను వివరాలు వెల్లడించారు. నిందితుడు బండి రమేశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బండి రమేశ్, తిరుపతి, రాజయ్య ముగ్గురు ఎల్లంకి సమీపంలో భవన నిర్మాణ పనుల్లో మేస్త్రీ శ్రీనివాస్ వద్ద పని చేస్తున్నారు. మేస్త్రీ రూ.2 వేలు తిరుపతికి ఇవ్వగా రమేశ్, రాజయ్యకు చెరో రూ.500 ఇచ్చి మిగతావి తన వద్దే ఉంచుకున్నాడు. ఈనెల 11న పని దొరక్కపోవడంతో డబ్బు ఇవ్వాలని తిరుపతిని రమేశ్ కోరగా మార్కెట్‌కు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిపోయాడు. కొంత సమయం తర్వాత మద్యం తీసుకువచ్చి తిరుపతి, రమేశ్ తాగారు. అనంతరం డబ్బుల విషయంలో గొడవ కాగా తిరుపతి కట్టె తీసుకొని రమేశ్‌ను కొట్టాడు. ఆగ్రహానికి గురైన రమేశ్ అదే కర్రతో తిరుపతిని బలంగా కొట్టడంతో కిందపడిపోయాడు. తిరుపతిని ఎల్లంకి కాలేజీ సమీపంలోని బురద గుంతలో పడేసి అక్కడే ఉన్న బండరాయితో తలపై కొట్టి చంపాడు. ఈ ఘటనపై సిద్దిపేట రూరల్ ఎస్సై అపూర్వరెడ్డి కేసు నమోదు చేశారు. సీఐ శ్రీను ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేయగా నిందితుడు బండి రమేశ్‌ను కాళ్లకుంట కాలనీలో అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు.

# నాటుసారా తయారుచేసిన వ్యక్తికి జైలు

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 14: నాటుసారా తయారు చేసిన వ్యక్తికి జరిమానాతో పాటు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ ఫస్ట్ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ హుస్నాబాద్ తీర్పునిచ్చినట్లు ఎక్సైజ్ సీఐ మురళీకృష్ణ గురువారం తెలిపారు. ధూళిమిట్ట మండలంలోని రెడ్యానాయక్ తండాకు చెందిన బానోత్ రమేశ్ నాటుసారా తయారీ కోసం 100 లీటర్ల బెల్లం పానకం నిల్వ చేశాడు. 16 ఫిబ్రవరి 2022లో చేర్యాల ఎక్సైజ్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించిన వాదనలు విన్న తర్వాత రమేశ్‌కు రూ.1,000 జరిమానాతో పాటు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ ఫస్ట్ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ హుస్నాబాద్ తీర్పునిచ్చినట్లు పేర్కొన్నారు. దీంతో రమేశ్‌ను కరీంనగర్ జైలుకు తరలించారు.

# క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన

సిద్దిపేటరూరల్, మార్చి 14: తోర్నాల వ్యవసాయ శాస్త్రవేత్తలు బుస్సాపూర్‌లో గురువారం మొక్కజొన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ మాట్లాడుతూ వరికి ప్రత్యామ్నాయంగా మొక్కజొన్నను సాగు చేసుకుంటే ఆశించిన ఆదాయం వస్తుందని తెలిపారు. మన్నె సాయిలు వ్యవసాయ క్షేత్రంలో వేసిన మొక్కజొన్న పంటను పరిశీలించి, రైతులకు యాజమాన్య పద్ధతులను వివరించారు. ప్రైవేటు కంపెనీలకు దీటుగా తోర్నాల వ్యవసాయ శాస్త్రవేత్తలు తయారు చేసిన విత్తనాలు చీడపీడలను తట్టుకొని మంచి లాభాలను తెచ్చిపెడతాయని తెలిపారు. తోర్నాల ప్రధాన శాస్త్రవేత్త శ్రీదేవి, సీనియర్ శాస్త్రవేత్త మల్లయ్య, సిద్దిపేట రూరల్ మండల వ్యవసాయ అధికారి పరశురాంరెడ్డి, ఏరువాక కేంద్ర కోఆర్డినేటర్లు విజయ్, పల్లవి, శాస్త్రవేత్తలు ఉమారాణి, సరిత, వ్యవసాయ విస్తరణ అధికారి ప్రేమ్ సాయి, బుస్సాపూర్ మాజీ సర్పంచ్ సదాశివరెడ్డి, రైతులు తిరుపతిరెడ్డి, కనకయ్య, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.


జొన్న పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు


మాట్లాడుతున్న గరీమా అగర్వాల్

# చెక్‌ముకి పోటీల్లో ఇర్కోడు విద్యార్థుల ప్రతిభ

సిద్దిపేటరూరల్, మార్చి 14: రాష్ట్రస్థాయి చెక్‌ముకి పోటీల్లో ఇర్కోడు ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. విద్యార్థులు అశ్విన్, ఉదయ్, సూర్యతేజను గురువారం పాఠశాలలో అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అభినందించారు. జనవిజ్ఞాన వేదిక తెలంగాణ ఆధ్వర్యంలో విద్యార్థులకు టెలీస్కోప్‌ను అందించారు. కార్యక్రమంలో డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ సమ్మిరెడ్డి, ఇర్కోడు స్పెషల్ ఆఫీసర్ పరశురాంరెడ్డి, ఆదర్శ పాఠశాలల కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్, ఇర్కోడు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ బుచ్చిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ సర్కారులో కరెంట్ కష్టాలు

## ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డితో గోడు వెల్లబోసుకున్న గిరిజన మహిళలు

దుబ్బాక, మార్చి 14: కాంగ్రెస్ సర్కారులో కరెంట్ కోతలు, నీళ్ల కష్టాలు వచ్చాయని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితో గిరిజన మహిళలు గోడు వెల్లబోసుకున్నారు. గురువారం దుబ్బాక మండలం వెంకటగిరి తండాలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పర్యటించారు. ఆ గ్రామ తాజామాజీ సర్పంచ్ కుమారుడి వివాహ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే స్థానిక మహిళలతో ముచ్చటించారు. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారులో నిత్యం కరెంట్‌కు కోత పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నల్లా నీళ్లు సరిగా రావడం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి కష్టాలు తెచ్చిందని ఆరోపించారు.

**నీటి వృథాకు ఎమ్మెల్యే అడ్డుకట్ట**

పట్టణంలోని ఓ కాలనీలో ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి పర్యటిస్తున్న క్రమంలో బోరు నీరు వృథాగా పోతున్నది. గమనించిన ఎమ్మెల్యే వెంటనే అక్కడికి వెళ్లి మోటర్ స్విచ్ ఆఫ్ చేశారు. వేసవి దృష్ట్యా నీరు వృథా కానివొద్దని సూచించారు. దుబ్బాక పట్టణంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఆస ముత్యం కుమారుడు సాగర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట కౌన్సిలర్లు యాదగిరి, స్వామి, శ్రీనివాస్, భూంరెడ్డి, కిషన్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.


వెంకటగిరితండాలో గిరిజన మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

# కేసీఆర్ సర్కారులోనే గజ్వేల్ అభివృద్ధి

గజ్వేల్, మార్చి 14: కేసీఆర్ నాయకత్వంలోనే గజ్వేల్ అభివృద్ధి చెందిందని, కేసీఆర్ కృషితో గజ్వేల్ అన్ని రంగాల్లో ముందుకుపోయిందని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని 17వ వార్డులో హిందూ స్మశానవాటిక ప్రహరీ నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, కౌన్సిలర్లు దుంబాల లక్ష్మీకిషన్‌రెడ్డి, చీర్ల శ్యామల మల్లేశం, నాయకులు గుంటుక రాజు పాల్గొన్నారు.


ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

# సందడిగా సైన్స్ ఫెయిర్

సిద్దిపేట, మార్చి 14: తల్లిదండ్రులు విద్యార్థులను వారికి ఇష్టమైన రంగాల వైపు ప్రోత్సహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు అన్నారు. గురువారం పట్టణంలోని శారదానికేతన్ పాఠశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ ఫెయిర్లు దోహదపడుతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారుచేసిన నమూనాలను పరిశీలించారు. విద్యార్థిని తేజస్వి బతుకమ్మ పండుగ ప్రత్యేకతను తెలిపిన విధానానికి ఆమెను మెచ్చుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సలీమ్, కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మం, ఉపాధ్యాయులు స్వాతి, రతీశ్ తదితరులు పాల్గొన్నారు.


నమూనాలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు

# పంట పొలాలకు సాగునీరు అందించాలి

నంగునూరు, మార్చి 14: ఎండుతున్న పంట పొలాలకు సాగు నీరు అందించి రైతులను ఆదుకోవాలని మండల ప్రజాప్రతినిధులు అధికారులను కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపీపీ కర్ణకంటి రేణుక అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయని, రంగనాయకసాగర్ కుడి కాల్వ నుంచి నీరు కొన్ని గ్రామాలకే వస్తున్నదని, వాగు అవతలి గ్రామాలకు సాగు నీరు అందడం లేదని పలువురు సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ వేణుగోపాల్ మాట్లాడుతూ.. ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ సమయంలో వివరాలు తప్పుగా నమోదు చేసిన లబ్ధిదారుల కోసం ఎంపీడీఓ కార్యాలయంలో రీఎంట్రీ కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామాల ప్రత్యేక అధికారులు పూర్తి స్థాయిలో హాజరు కావాలని, హాజరు కానివారిపై చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీలు ఎంపీడీఓను కోరారు.

# హుండీ ఆదాయం రూ.1.04 కోట్లు

చేర్యాల, మార్చి 14: కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ హుండీలను లెక్కించారు. 26 రోజుల్లో రూ.1,04,86,906 ఆదాయం సమకూరింది. ఆలయ హుండీలను మహా మండపంలో ఈవో బాలాజీ ఆధ్వర్యంలో సిద్దిపేట పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ ఈవో విశ్వనాథశర్మ పర్యవేక్షణలో గురువారం లెక్కించారు. ఆలయంలోని మొత్తం 23 హుండీలకు ఆలయ అర్చకులు, ఉద్యోగులు, తాత్కాలిక సిబ్బంది, రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన శివశక్తి సేవా సమితి భజన సభ్యులు 260 మందితో లెక్కింపు జరిపారు. నగదుతోపాటు, 97 గ్రాముల మిశ్రమ బంగారం, 12 కిలోల 100 గ్రాముల మిశ్రమ వెండి, 26 క్వింటాళ్ల బియ్యం, 27 ఇతర దేశాల కరెన్సీ నోట్లు లభించాయి. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ 21 రోజుల్లో 23 హుండీల ఆదాయం 1,04,86,906 వచ్చిందని తెలిపారు. ఈ నగదును స్థానిక ఏపీజీవీబీలో జమ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, కమిటీ సభ్యులు, ఏఈవో గంగా శ్రీనివాస్, బుద్ధి శ్రీనివాస్, పర్యవేక్షకుడు నీల శేఖర్, ఆలయ స్థానాచార్యుడు పడిగన్నగారి మల్లేశం, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. హుండీ లెక్కింపు సందర్భంగా కొమురవెల్లి ఎస్‌ఐ నాగరాజు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

# కాల్వలు తవ్వి రైతుల పక్షాన నిలబడండి

- ఎంపీపీ కూర మాణిక్య రెడ్డి

చిన్నకోడూరు, మార్చి 14: కాంగ్రెస్ గవర్నమెంట్ వచ్చింది.. మీవెంట మేము నడుస్తాం.. రైతుల పంటలు ఎండకుండా కాల్వల ద్వారా సాగునీరు అందించాలని ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి కాంగ్రెస్ నాయకులకు విజ్ఞప్తి చేశారు. చిన్నకోడూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. సుమారు 11 కాల్వలు, 78 ఎకరాల్లో కాల్వ పనులు జరపొద్దని కాంగ్రెస్‌కు చెందిన అడ్వకేట్ రచనారెడ్డి గజ్వేల్ కేంద్రంగా కేసులు వేసిందన్నారు. కేసీఆర్ సర్కార్ హయాంలో ఏనాడూ ఎకరం ఎండలేదని గుర్తుచేశారు. ముందు జాగ్రత్తల్లో భాగంగా అన్నపూర్ణ, రంగనాయకసాగర్ రిజర్వాయర్లు నిర్మించినట్లు తెలిపారు. మంత్రి కొండా సురేఖ టీఎంసీ నీటిని విడుదల చేసి లక్ష పదివేల ఎకరాలకు నీరందిస్తామని చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు రైతుల ఇబ్బందులను గుర్తించి సొంత డబ్బులు వెచ్చించి తాత్కాలిక పద్ధతిలో రైతుల కోసం కాల్వలు తవ్విస్తున్నట్లు తెలిపారు. వారం పది రోజుల్లో నీటిని పూర్తిస్థాయిలో విడుదల చేయకపోతే రైతులు రోడ్డెక్కే పరిస్థితి నెలకొంటుందని ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి అన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి

# సౌకర్యాలు లేవు.. మేము వెళ్లం

- తేల్చిచెప్పిన హుస్నాబాద్ డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు

హుస్నాబాద్, మార్చి 14: హుస్నాబాద్ పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తున్నా అందులోకి కళాశాలను మార్చడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. అరకొర వసతుల మధ్య పాత భవనంలోనే తరగతులు నడుస్తున్నాయి. ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ మనుచౌదరి నూతన భవనాన్ని పరిశీలించారు. అందులోకి మారాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భిక్షపతి సహా సంబంధిత అధికారులను ఆదేశించి రెండు రోజులైనా కొత్త భవనంలోకి కళాశాలను మార్చడం లేదు. ఈ భవనంలో కరెంట్, నీటి సౌకర్యం లేదని, మారితే విద్యార్థులు ఇబ్బందులు పడుతారని ప్రిన్సిపాల్, అధ్యాపకులు వాదిస్తున్నారు. ఈ విషయమై గురువారం విద్యాశాఖ ఇంజినీరింగ్ డీఈ నాగభూషణాచారితో పాటు స్థానిక సీఐ శ్రీనివాస్ ప్రిన్సిపాల్ అధ్యాపకులను కొత్త భవనం వద్దకు పిలిపించి భవనాన్ని స్వాధీనం చేసుకోవాలని సూచించగా అందుకు ప్రిన్సిపాల్ ఒప్పుకోలేదు. త్వరలోనే సౌకర్యాలు కల్పిస్తామని చెప్పినా వినకుండా అక్కడి నుంచి వెళ్లిపోయారు. మంత్రి, కలెక్టర్ ఆదేశించినా సంబంధిత అధికారులు సౌకర్యాలు కల్పించకపోవడంతో నూతన భవనం పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

# కెప్టెన్‌ను కలిసిన కడియం కావ్య

హుస్నాబాద్, మార్చి 14: వరంగల్ పార్లమెంట్ స్థానానికి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా టికెట్ ఖరారు కావడంతో కడియం కావ్య గురువారం హన్మకొండలో రాజ్యసభ మాజీ సభ్యుడు, బీఆర్‌ఎస్ సీనియర్ నేత కెప్టెన్ లక్ష్మీకాంతరావును కలిసి పుష్పగుచ్ఛం అందించి ఆశీర్వాదం తీసుకున్నారు. హన్మకొండలోని కెప్టెన్ నివాసానికి వెళ్లిన కావ్య కెప్టెన్ లక్ష్మీకాంతరావు, మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌ల ఆశీర్వాదం తీసుకొని వచ్చే ఎన్నికల్లో తన గెలుపునకు సహకరించాలని కోరారు. తనకు టికెట్ కేటాయించిన తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌కు, కెప్టెన్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు.


కెప్టెన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కడియం కావ్య

# తాగునీటి ఇబ్బందులు ఉండొద్దు

జగదేవ్‌పూర్, మార్చి 14: పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఏ గ్రామంలో పారిశుధ్య, తాగునీరు, కరెంట్ సమస్యలు రావొద్దని ఎంపీపీ బాలేశంగౌడ్ అన్నారు. గురువారం మండల కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయాశాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. అనంతరం ఎంపీపీ జడ్పీటీసీ వంటేరు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ వేసవి దృష్ట్యా తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇటిక్యాల, కొత్తపేట గ్రామాల్లో ఉదయం, సాయంత్రం రెండు పూటలా నీళ్లు వచ్చేలా చూస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తిరుమల్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, తహసీల్దార్ కృష్ణమోహన్, ఎంపీడీవో శ్రీనివాసవర్మ, ఎంపీటీసీలు కిరణ్, కవిత, మహేందర్‌రెడ్డి, మహేశ్, కావ్యాదుర్గయ్య, స్రవంతీశివకుమార్, నసీమీబేగం, ఎంఈవో ఉదయభాస్కర్‌రెడ్డి, ఏవో వసంతరావు, ఏపీఎం ఆనంద్, ప్రత్యేక అధికారులు కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బాలేశంగౌడ్

# సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

హుస్నాబాద్, మార్చి 14: సాగునీరు లేక పంటలు ఎండిపోయి రైతులు విలవిల్లాడుతున్నారని, వారి సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని తెలంగాణ రైతురక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు ఆరోపించారు. గురువారం హుస్నాబాద్‌లోని రాజరాజేశ్వర ఫంక్షన్ హాల్‌లో రైతు సమావేశం నిర్వహించి మాట్లాడారు. పంటకు గిట్టుబాటు ధర లేక, చేసిన అప్పులు తీర్చలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ పనులకు అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు. పంటలకు గిట్టుబాటు ధర, సకాలంలో బ్యాంకుల ద్వారా రుణాలు ఇవ్వాలని, పంటల బీమా పథకాన్ని పక్కాగా అమలు చేయాలని కోరారు. సమావేశంలో సమితి జిల్లా అధ్యక్షుడు మారెడ్డి రామలింగారెడ్డి, ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, సుద్దాల చంద్రయ్య, పచ్చిమట్ల రవీందర్‌గౌడ్, అయిలేని శంకర్‌రెడ్డి, పాకాల శ్యాంసుందర్, శ్రీనివాస్‌గౌడ్, గాల్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీహరిరావు

# 'చీకటిమయంగా కార్మికుల జీవితాలు'

సిద్దిపేట, మార్చి 14: మూడు రంగుల జెండా పార్టీ.. మూడు చక్రాల ఆటో కార్మికుల జీవితాల్లో చీకటి నింపిందని సిద్దిపేట ఆటో క్రెడిట్ కోపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు పాల సాయిరాం మండిపడ్డారు. గురువారం సిద్దిపేట ఆటో క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆటో కార్మికులతో కలిసి ఆయన మాట్లాడారు. ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయం చూపకుండా మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించడంతో ఆటో కార్మికులు ఉపాధి కోల్పోతున్నారన్నారు. బతుకు మీద భారంతో ఎంతోమంది ఆటో కార్మికులు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంతో 50 లక్షల ఆటో కార్మికుల జీవితాలు రోడ్డున పడ్డాయన్నారు. ప్రభుత్వం ఆటో కార్మికులకు న్యాయం చేయకపోతే కార్మికులందరినీ ఏకం చేసి పోరాటం చేస్తామన్నారు.


మాట్లాడుతున్న పాల సాయిరాం

# వీడిన హెటిరో ఎర్ర రాతల మిస్టరీ

తొగుట, మార్చి 14: మండలంలోని పెద్దమాసాన్‌పల్లి హెటిరో భూముల్లో మావోయిస్టుల పేరున వెలిసిన వాల్ రైటింగ్స్ మిస్టరీ వీడింది. తాము కోల్పోయిన భూములను దక్కించుకోవాలని చూసిన వారు కటకటాలపాలయ్యారు. తొగుట సీఐ లతీఫ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పెద్దమాసాన్‌పల్లి మధిర ఇందిరానగర్‌కు చెందిన బోనాల రాజు అలియాస్ గగన్‌కు ఆరు ఎకరాలు ఉండగా 2014లో 4.23 ఎకరాలు హెటిరోకు అమ్మాడు. ఉన్న ఎకరంలో వ్యవసాయం ఉంది. ఈ ఎకరం భూమి నుంచి కంపెనీ ఫెన్సింగ్ వేస్తున్నట్లు తెలియడంతో తన భూమిలో నుంచి ఫెన్సింగ్ వేయవద్దని చెప్పినా కంపెనీ పట్టించుకోకపోవడంతో తన సమస్యను మహారాష్ట్రకు చెందిన మిత్రుడు యాష్ అజయ్ మహత్‌కు తెలిపాడు. మావోయిస్టుల పేరున భయభ్రాంతులకు గురిచేస్తే తన భూమి తనకు దక్కుతుందని భావించాడు. ఈ క్రమంలో ఈ నెల 9న అర్ధరాత్రి 12 గంటలకు అజయ్ మహత్‌తో కలిసి రాజు హైదరాబాద్ నుంచి వచ్చి పన్యాల ఎల్లారెడ్డి పొలం వద్ద ఎర్ర రంగు బ్యానర్ కట్టారు. సెక్యూరిటీ గార్డు రూమ్ వద్ద కలర్ డబ్బాలతో మావోయిస్టు హెచ్చరికలు అని రాశారు. 14న ఉదయం ఇద్దరు యాక్టివాపై తొగుటకు వస్తుండగా అనుమానంతో ఎస్సై లింగం సిబ్బందితో కలిసి విచారణ చేయగా నేరాన్ని ఒప్పుకున్నారు. ఈ ఘటనలో పట్టుబడ్డ వస్తువులను సీజ్ చేసినట్లు తెలిపారు.

### నేడు ఎమ్మెల్యే పల్లా పర్యటన

చేర్యాల, మార్చి 14: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి శుక్రవారం మున్సిపాలిటీలో పర్యటించనున్నారని బీఆర్‌ఎస్ పట్టణ నాయకులు తెలిపారు. వివిధ అభివృద్ధి పనులను పరిశీలించడంతోపాటు వాటి పురోగతి, పెండింగ్‌లో ఎందుకు ఉన్నాయనే అంశాలను తెలుసుకోనున్నారు. అనంతరం ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పర్యటిస్తున్నందున్న అన్ని వార్డులకు చెందిన కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని కోరారు.

### ఎన్నికల్లో అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలి

సిద్దిపేట అర్బన్, మార్చి 14: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అధికారులు అప్రమత్తంగా ఉండి విధులు నిర్వర్తించాలని అదనపు డీసీపీ మల్లారెడ్డి అన్నారు. గురువారం సిద్దిపేట కమిషనరేట్ కార్యాలయంలో ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లు, స్టాటిస్టిక్ సర్వైలెన్స్ టీమ్ ఇన్‌చార్జిలు, సిబ్బందికి పార్లమెంట్ ఎన్నికల్లో విధులపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. వాహనాలు తనిఖీ చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కడి నుంచి ఫిర్యాదులు వచ్చినా స్పందించాలని ఆదేశించారు.

### మున్సిపల్ మేనేజర్‌కు కమిషనర్ బాధ్యతలు

చేర్యాల, మార్చి 14: చేర్యాల మున్సిపాలిటీలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రభాకర్‌కు కమిషనర్ బాధ్యతలు అప్పగిస్తూ సంబంధిత శాఖ ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న తన్నీరు రమేశ్ ఇటీవల సస్పెన్షన్‌కు గురికావడంతో మేనేజర్‌కు కమిషనర్ బాధ్యతలు అప్పగించారు. అదనపు బాధ్యతలు తీసుకున్న ప్రభాకర్‌కు కార్యాలయ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

### షెటర్ల కేటాయింపు

హుస్నాబాద్ టౌన్, మార్చి 14: మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ షెటర్లను డ్రా పద్ధతిలో కేటాయించామని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ గౌడ్ గురువారం ప్రకటనలో తెలిపారు. మూడు అంతస్తుల కాంప్లెక్స్‌లో 17 షెటర్లు ఉండగా దరఖాస్తు చేసుకున్న ఎనిమిది మందికి షెటర్లను కేటాయించినట్లు పేర్కొన్నారు.

### ధర్మకర్తల మండలి ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

వర్గల్, మార్చి 14: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల పాలకమండలి ఏర్పాటుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసిందని దేవస్థాన కార్యనిర్వహణ అధికారిని అన్నపూర్ణ గురువారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల కోసం దరఖాస్తులు నాచారం దేవస్థానం వద్ద అందుబాటులో ఉన్నాయని, ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 15వ తేదీ నుంచి 20 రోజులలోగా పూర్తిచేసిన దరఖాస్తులను రాష్ట్ర, జిల్లా ఎండోమెంట్ కార్యాలయం లేదా నాచారం దేవస్థానం కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

### 'మిల్లర్ల తీర్మానాలకు విరుద్ధంగా ఎన్నికలు'

చేర్యాల, మార్చి 14: రైస్‌మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తీర్మానాలకు విరుద్ధంగా ఎన్నికలు నిర్వహించడం సరికాదని మిల్లర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు నేతి నారాయణ గురువారం ప్రకటనలో ఆరోపించారు. గత నెలలో తనపై దాడి జరిగితే రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ స్పందించలేదన్నారు. కుట్రపూరితంగా వ్యవహరిస్తూ మిల్లర్స్ తీర్మానాలకు విరుద్ధంగా ఎన్నికలు జరగక ముందే అధ్యక్షుడిని ప్రకటించడం అనుమానాలకు తావిస్తున్నదని పేర్కొన్నారు.

### టవర్ ఎక్కిన యువకులు

బెజ్జంకి, మార్చి 14: అనాథాశ్రమం ఏర్పాటుతో పాటు స్థలం కేటాయించాలని కోరుతూ గన్నేరువరంలోని చీమలకుంట పల్లికి చెందిన బామండ్ల రాజు, మహంకాళి ప్రశాంత్, కొంకటి వేణు మండల కేంద్రంలోని టవర్ ఎక్కి ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న పోలీస్ సిబ్బంది, ఎంపీడీవో లక్ష్మప్ప అక్కడికి చేరుకొని సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలుపడంతో టవర్ దిగి వచ్చారు.

**హెచ్చరిక ప్రకటన**

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియపరచడము ఏమనగా శ్రీ బోరవంతల సత్యనారాయణ తండ్రి అంజయ్య, నివాసం తిమ్మాపూర్ ప్రస్తుత నివాసం హైదరాబాద్ గారు వారి యొక్క ఆస్తి అనగా రిజిష్టర్ దస్తావేజు నం. 2147/2017 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయము దుబ్బాక ద్వారా సంక్రమించిన సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలము తిమ్మాపూర్ గ్రామములో గల సర్వే నం. 586/అ లోని ఖాళీ స్థలము విస్తీర్ణం 121-00 చ.గ.లు, దీని హద్దులు **తూర్పు:** శ్రీ కూర యాదగిరి గారి ఖాళీ స్థలము, **పడమర:** 12 ఫీట్ల త్రోవ, **ఉత్తరము:** మెయిన్ రోడ్డు (రామాయంపేట నుండి సిద్దిపేట) మరియు **దక్షిణం:** శ్రీ బొనగల ప్రవీణ్ గారి ఖాళీ స్థలముగా గల ఆస్తిని నా క్లయింటు అగు శ్రీ పారిపల్లి శ్రీనివాస్ తండ్రి బాలయ్య, నివాసం సిద్దిపేట గారికి విక్రయించి విక్రయ ఒప్పంద పత్రము వ్రాసి యిచ్చి నా క్లయింటు నుండి అడ్వాన్స్ డబ్బులు కూడా పొందియున్నారు. కానీ ప్రస్తుతము శ్రీ బోరవంతల సత్యనారాయణ గారి నా క్లయింటుకు తెలియకుండా దురుద్దేశ పూర్వకముగా పై ఆస్తిని ఇతరులకు విక్రయించుటకు ప్రయత్నిస్తున్నాడు అని తెలియవచ్చినది. కావున పై ఆస్తిని నా క్లయింటుకు తెలియకుండా శ్రీ బోరవంతల సత్యనారాయణ గారి నుండి ఎవరూ ఖరీదు చేయవద్దని, ఒక వేళ ఖరీదు చేసిననూ చెల్లనేరదని మరియు నా క్లయింటు తీసుకునే సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురని హెచ్చరించనైనది.

**సం/- కె. సాయినారాయణ,** అడ్వకేట్
ఇ.నం. 4-3-8, పటేల్‌పురా స్ట్రీట్, సిద్దిపేట
సెల్: 9848319114